# విజ్ఞాన మార్పిడి అభినందనీయం

**గ్రామీణమంగళగిరి, న్యూస్‌టుడే:** శాస్త్ర సాంకేతిక, వైద్య రంగాల్లో దేశాల నడుమ విజ్ఞాన మార్పిడి సహకారం ఆహ్వానించదగిన పరిణామ మని హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్నలీస్ ఎం. క్యూర్ పేర్కొన్నారు. మంగళగిరి మండలంలోని చినకాకాని ఎన్నారై అకాడమీని గురువారం ఆయన సతీసమేతంగా సందర్శించారు. ఎన్నారై అకాడమీ డీన్ అంజిరెడ్డి, వైద్యకళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగిరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ బుచ్చిబాబులు కార్నలీస్ దంపతులకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ళ కిందట వైద్యవిద్యలో విజ్ఞానం పెంపొందించుకునేందుకు విదేశాలకు వెళుతున్న వారిని బ్రెయిన్ డ్రెయిన్‌గా పోల్చే వారన్నారు. ఇప్పుడది బ్రెయిన్ షేరింగ్‌గా మారిందన్నారు. దేశంలో వైద్యవిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిందని, వైద్య కళాశాలలు పెరగడం హర్షణీయమన్నారు. ఎన్నారై అకాడమీ పలుదేశాల్లో వైద్య విజ్ఞానానికి సంబంధించి పరస్పర ఒప్పందాలు చేసుకోవడం అభినందనీయమనిఅన్నారు. ఎన్నారై అకాడమీ ఏర్పాటు, వైద్య కళాశాలలోని వివిధ కోర్సులు, ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు తదితర అంశాలను అంజిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్ళే వైద్య విద్యార్థులకు వీసాలు త్వరితగతిన మంజూరు చేయాలని కార్నలీస్‌ను బుచ్చిబాబు కోరారు. దీనికి కాన్సులేట్ జనరల్ కార్నలీస్ సానుకూలంగా స్పందించారు.



**ఎన్నారై ఆసుపత్రిని పరిశీలిస్తున్న కార్నలీస్, వైద్యులు**